
సాక్షి గుంటూరు

బుధవారం। 24। జూలై। 2024

I



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు.



ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ఫిరంగిపురం: రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్లను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ మాచవరానికి చెందిన ఎం.శ్రీయన్ కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది.

న్యూస్‌రీల్

శాకంబరీగా దుర్గమ్మ



కొలివరం (తెనాలి): కొలివరం బీసీ కాలనీలోని శ్రీదుర్గా మల్లేశ్వరి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి మంగళవారం శాకంబరి అలంకారం చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త జాజుల వెంకటేశ్వరరావు, దక్షిరాజు మణికంఠవర్మ, జగదీష్ పర్యవేక్షించారు.

గిరి ప్రదక్షిణ యాత్రకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

సత్తెనపల్లి: పట్టణం నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు ఈ నెల 27న ఆర్టీసీ బస్సు బయలు దేరుతుందని ఆర్టీసీ డీఎం జీఎస్‌వీ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 28న ఉదయం శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలం బయలుదేరుతుందన్నారు. ఈ నెల 29న పౌర్ణమి రోజున గుడి ప్రదక్షిణ చేసుకుని తిరుగు ప్రయాణంలో కంచి కూడా చూసుకుని 30న తిరిగి సత్తెనపల్లి చేరుతుందన్నారు. సూపర్‌లగ్జరీ పుష్ బ్యాక్ 2+2 రాను పోను ఒకరికి రూ.2,500గా టికెట్ చార్జీ నిర్ణయించామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 9959225429, 7382896966, 7382895691 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆక్వా పార్కుకు భూమి పరిశీలన



నిజాంపట్నం: ఆక్వా రైతులకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఆక్వా పార్కును ఏర్పాటు చేస్తుందని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. మండలంలోని దిండి ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఆక్వా పార్కుకు అవసరమైన భూమిని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 300 ఎకరాలు సేకరించడం జరుగుతుందని చెప్పారు. అందులో 50 ఎకరాలు పర్యాటక శాఖకు, 50 ఎకరాలు రిజర్వ్ ఫారెస్ట్ కింద అటవీశాఖకు అప్పగించనున్నట్లు వెల్లడించారు.

గ్రాంటుగానే ఇవ్వాలి



కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి, ఉద్యోగ కల్పనకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. ద్రవ్యోల్బణం తగ్గించే చర్యల్లేవు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తదితర వాటికి నిధుల కేటాయింపులేదు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ఇస్తామని ప్రకటించినా.. వివిధ ఆర్థిక సంస్థల ద్వారా ఇస్తామనడం తగదు. గ్రాంటుగానే సాయం ఇవ్వాలి. రాష్ట్ర విభజన హామీలు, కడప ఉక్కు, విశాఖ రైల్వే జోన్, రామాయపట్నం ఓడరేవు ప్రస్తావన లేదు.

కేఎస్ లక్ష్మణరావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ

'రామన్' ఎఫెక్ట్

శరుణం గచ్ఛామి !

- అమరావతికి భారీ కేటాయింపులు
- అదీ వివిధ ఏజెన్సీల ద్వారా రుణంగానే!
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మెలిక
- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన





సాక్షి ప్రతినిధి, గుంటూరు: భారీగా నిధుల కేటాయింపు.. అయితే షరతులు వర్తిస్తాయి. ఇదేదో వ్యాపార ప్రకటనలా ఉంది కదూ.. కేంద్రంలో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సాయం కూడా అక్షరాలా ఇలానే ఉంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. అంతలోనే ఈ నిధులు వివిధ ఏజెన్సీల ద్వారా అప్పు రూపంలో ఇస్తామని ఆమె ప్రకటించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయితే దీనిలో కొంత గ్రాంట్ ఉంటుందన్న ఆశాభావం రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తం చేస్తోంది. చిత్తశుద్ధి ఉంటే కేంద్రం పూర్తిగా నిధులు కేటాయించేదని, అప్పుగా ఇవ్వడం ఎంతవరకు సమంజసమని విపక్షాలు నిలదీస్తున్నాయి.

రైల్వే కేటాయింపులపై స్పష్టత లేదు



రైల్వే బడ్జెట్ విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గత బడ్జెట్ కంటే ఇప్పుడు రైల్వే శాఖకు ఎంత కేటాయింపులు జరిగాయన్న విషయాలను ఇంకా విడుదల చేయలేదు. గుంటూరు -బీబీ నగర్ లైన్‌కు టెండర్లు కూడా పిలవడంతో ఈ బడ్జెట్‌లో నిధులు వస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

వేతన జీవులకు కాస్త ఊరట



కేంద్ర బడ్జెట్‌పై ప్రభుత్వ ఉద్యోగుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఆదాయపు పన్నులో శాశ్వత మినహాయింపు, ట్యాక్స్ పరిధిని రూ.8లక్షలకు పెంచితే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమైంది. ప్రభుత్వ ఉద్యోగుల వైద్య సదుపాయాలు ఖర్చునూ ఆదాయ పన్ను పరిధిలోకి తేవాలని వారు కోరుతున్నారు. మొత్తంగా సంతృప్తికరంగా లేకపోయినా వేతన జీవులకు పన్నుల రూపంలో కొంత వరకూ ఊరటనిచ్చిందని చెబుతున్నారు.

పారిశ్రామికీకరణకు అవకాశం!

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటించడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పారిశ్రామికీకరణకు కొంత మేర ఉపయోగం ఉండవచ్చు. బంగారంపై సుంకం తగ్గింపుతో ధరలు దిగి రానున్నాయని బులియన్ మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే పుత్తడి 10 గ్రాములకు మూడు వేల రూపాయల వరకూ తగ్గింది. మొబైళ్లు, చార్జర్ల ధరలూ తగ్గే అవకాశం ఉంది.

జాతీయ రహదారులకు మోక్షం కలిగేనా!



జాతీయ రహదారులకు పెద్దపీట వేస్తామని ప్రకటించడంతో జిల్లాలో ఇప్పటికే మంజూరైన రహదారులకు మోక్షం కలిగే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో వాడరేవు-నకరికల్లు, పేరేచర్ల- కొండమోడు, సాగర్-దావుపల్లి, మాచర్ల-దాచేపల్లి రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించి అభివృద్ధి చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. ఇవి కాకుండా గుంటూరు-కాజ నుంచి తెనాలి మీదుగా తూర్పు బైపాస్ పనులూ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఒరిగిందేమీ లేదు



కేంద్ర బడ్జెట్‌తో ప్రభుత్వ ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదు. ఆదాయపు పన్నులో శాశ్వత మినహాయింపు, ట్యాక్స్ పరిధిని పెంచితే మేలు జరిగేది. రూ.8 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఇవ్వాలి. స్టాండర్డ్ డిడక్షన్ రూ.లక్ష వరకు మినహాయింపు ఇవ్వాలి.

– చాంద్‌బాషా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు

ఐటీ శ్లాబ్ ఆశాజనకంగా లేదు



క్యాపిటల్ గెయిన్స్ ఇండక్సేషన్ తీసేశారు. ప్రైస్ ఇండెక్స్ రూ.12.5కి పెంచారు. గృహ రుణాలపై కొంత మేర సబ్సిడీ ఇచ్చారు. ఐటి శ్లాబ్ ఆశాజనకంగా లేదు. ఇప్పుడు ఆర్థిక వృద్ధి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. టాక్స్‌ల విషయంలో మరింత లబ్ధి చేకూరితే బాగుండేది.

– ఆళ్ళ శివారెడ్డి, బిల్డర్

హోదాతోనే సమగ్రాభివృద్ధి



విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా చితికిపోయింది. హోదాతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం. ప్రత్యేక హోదాపై కేంద్రం నోరు మెదపకపోవడం బాధాకరం. బిహార్, జార్ఖండ్‌కు ఇచ్చిన ప్రాధాన్యం ఏపీకి ఆశించిన స్థాయిలో ఇవ్వలేదు. విశాఖ రైల్వే జోన్ విషయంపై ప్రకటన లేదు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపులో అన్యాయం జరిగింది.

– బత్తుల వీరాస్వామి, అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు

సగటు ఉద్యోగికి ఊరట



కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయపుపన్ను శ్లాబ్‌లో సగటు ఉద్యోగికి ఊరట లభించింది. రాష్ట్ర విభజన హామీల మేరకు నిధులు ఇస్తామని ప్రకటించడం బాగుంది. ఇది రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించే బడ్జెట్ అని భావిస్తున్నా.

– ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు, గుంటూరు

నిరాశాజనకం



కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. నిధుల కేటాయింపు ఆశించిన స్థాయిలో లేదు. రాజధాని నిర్మాణం కోసం వివిధ సంస్థల ద్వారా రూ.15 వేల కోట్లు సమకూర్చుతామని చెప్పారు తప్ప కేంద్రం గ్రాంటు విడుదల చేస్తుందని చెప్పలేదు. ప్రత్యేక హోదా విభజన చట్టంలోని హామీల అమలు ప్రస్తావన లేదు. పోలవరం నిర్మాణానికి నిధుల కేటాయింపు లేదు.

– పాశం రామారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఉద్యోగ వర్గాలకు కొంత ఉపశమనం



ఆదాయపు పన్ను మినహాయింపును రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పెంచారు. దీనిని రూ. 5 లక్షల వరకు పెంచితే బాగుండేది. ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుంచి 75 వేలకు, పెన్షనర్స్‌కు రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. ఇది కొంత వరకు ఉపశమనం. జీఎస్టీలోనూ మార్పులు జరిగాయి.

– రామరాజు శ్రీనివాసరావు, చైర్మన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ పేయర్స్ సౌత్ జోన్

నిరుత్సాహపరిచింది



కేంద్ర బడ్జెట్ అట్టడుగు వర్గాల ప్రజలను నిరుత్సాహపరిచింది. పెరుగుతున్న ధరలను, అదుపు చేసేందుకు ఈ బడ్జెట్ ఏ మాత్రం ఉపయోగపడదు. కొన్ని పక్షాలను సంతృప్తి పరచడానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఇది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చదు.

– జంగాల అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయింపుల్లేవు



కేంద్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయింపుల్లేవు. గుంటూరు నుంచి హైదరాబాద్, బెంగళూరుకు రెండో రైల్వే లైన్ వేస్తామని హామీ ఇచ్చారు. వీటి ప్రస్తావన లేదు. దేశంలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి.

– జూపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర రజక జన సేవా సంఘ ప్రధాన కార్యదర్శి

దారుణం



ప్రత్యేక హోదాపై పెదవి విప్పకపోవడం దారుణం. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మించాల్సిన కేంద్రం తన బాధ్యత నుంచి తప్పుకుంది. రూ.15 వేల కోట్లు అప్పు రూపంలో ఇప్పిస్తామని చెప్పి చేతులు దులుపుకుంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, పునరావాస ఖర్చుకు నిధులపై స్పష్టత లేదు. ఏపీపై కేంద్రం ఇంకా వివక్ష చూపిస్తూనే ఉంది.

– కొండా శివరామిరెడ్డి, అవగాహన సంస్థ కార్యదర్శి

టీడీపీ హత్యోన్మాదం



గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈదా సాంబిరెడ్డిని దాడి గురించి అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, చిత్రంలో రోధిస్తున్న సాంబిరెడ్డి భార్య

- పల్నాడులో ఆగని రాక్షస కాండ
- వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఈదా సాంబిరెడ్డిపై హత్యాయత్నం
- రాడ్లు, కర్రలతో దాడికి తెగబడిన దుండగులు
- దాడి సమయంలో పెదకూరపాడు నియోజకవర్గంలోనే ఎస్పీ శ్రీనివాసరావు



దుండగులు దాడి చేసిన కారు ఇదే

సాక్షి, నరసరావుపేట/నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పల్నాడులో టీడీపీ రాక్షసకాండ కొనసాగుతోంది. ఎన్నికలైనప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా అధికారపక్షం సాగిస్తున్న మారణహోమం చల్లారడం లేదు. తెలుగుదేశం గూండాల రక్తదాహం తీరడం లేదు. గతవారం వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్ హత్యోదంతాన్ని మరువక ముందే మరో హత్యాయత్నానికి టీడీపీ నేతలు తెగబడ్డారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కీలకనేత, క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డిపై రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఫలితంగా పల్నాడులో మళ్లీ హైటెన్షన్ నెలకొంది. గుంటూరు నుంచి తన స్వగ్రామమైన 75 త్యాళ్లూరుకు వస్తున్న సమయంలో సాంబిరెడ్డిపై టీడీపీ రౌడీలు హత్యాయత్నం చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సాంబిరెడ్డితోపాటు కారులో ఉన్న పార్టీ నాయకులు గంగాధరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కారు డ్రైవర్ దామోదరరెడ్డి కూడా గాయపడ్డారు. ఓ వైపు టీడీపీ రాక్షస కాండను నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో ఆందోళనకు సిద్ధమవుతున్న తరుణంలోనే టీడీపీ నేతలు సాంబిరెడ్డిపై హత్యాయత్నం చేయడం గమనార్హం.

ఎస్పీ పర్యటన సమయంలోనే..

కొత్తగా పల్నాడు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కంచి శ్రీనివాసరావు మంగళవారం సత్తెనపల్లి, రాజుపాలెం, బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరులలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నేత ఈదా సాంబిరెడ్డిపై టీడీపీ గూండాలు దాడి చేస్తున్న సమయంలో ఎస్పీ పెదకూరపాడు నియోజకవర్గంలోనే పర్యటిస్తుండడం గమనార్హం.

ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

అమరావతి: సాంబిరెడ్డిపై హత్యాయత్నం జరిగిన ఘటనాస్థలాన్ని పల్నాడు ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం రాత్రి పరిశీలించారు. ధ్వంసమైన కారును చూసి ఘటన వివరాలను పోలీసులను అడిగి తెలుసుకున్నారు. నిందితులను పట్టుకోవడానికి డాగ్ స్క్వాడ్‌ను రప్పించాలని, ఆధారాల సేకరణకు క్లూస్ టీంను ఏర్పాటు చేయాలని, పోలీసు అధికారులతో ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి త్వరగా నిందితులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అమరావతి సీఐ బ్రహ్మం, పెదకూరపాడు ఎస్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

దాడులు మంచి పద్ధతి కాదు : నంబూరు

40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి వివాదాలకు వెళ్లే వ్యక్తి కాదని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు సాంబిరెడ్డిపై మంగళవారం సాయంత్రం జరిగిన హత్యాయత్నాన్ని నంబూరు ఖండించారు. దాడి ఘటన గురించి తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే ఆస్పత్రికి చేరుకుని సాంబిరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటనలో సాంబిరెడ్డి వెంట ఉన్న కె.గంగాధర్‌రెడ్డి, దామోదరరెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డిలతో మాట్లాడారు. ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ సాంబిరెడ్డిపై పథకం ప్రకారమే దాడి జరిగిందని పేర్కొన్నారు. కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయని వివరించారు. దాడులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి విషసంస్కృతి లేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ దాడులను ప్రోత్సహిస్తోందని, గ్రామాల్లో నాయకులు ఉండలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. ఘటన గురించి ఎస్పీ, డీఎస్పీ, సీఐల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. నిందితులను వెంటనే గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. సాంబిరెడ్డిపై జరిగిన హత్యాయత్నం గురించి తెలిసి కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వర్గీయుల పనే!



గాయపడిన దామోదరరెడ్డి

ప్రతిపక్ష వైఎస్సార్ సీపీని నిర్వీర్యం చేసేందుకు టీడీపీ కుయుక్తులు పన్నుతోంది. దాడులతో మారణహోమం సృష్టించి వైఎస్సార్ సీపీ నాయకులను భయపెట్టి పార్టీ కార్యక్రమాలకు దూరం చేయాలని కుట్రపన్నుతోంది. దీనిలోభాగంగానే హత్యాసంస్కృతిని ప్రోత్సహిస్తోంది. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వర్గీయులే ఈదా సాంబిరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడినట్టు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును గుంటూరులోని పార్టీ కార్యాలయంలో కలిసి కారులో వస్తుండగా పక్కా పథకం ప్రకారం దాడి చేసి సాంబిరెడ్డిని అంతమొందించాలని యత్నించారు. పది మందికిపైగా దుండగులు సాంబిరెడ్డి, ఆయనతోపాటు ఉన్న నాయకులు కీసర గంగాధర్‌రెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, కారు డ్రైవర్ దామోదర్ రెడ్డిలపై విచక్షణారహితంగా మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. పోలింగ్ రోజు భాష్యం ప్రవీణ్ భార్య లావణ్య 75 త్యాళ్లూరు పోలింగ్ కేంద్రంలో దౌర్జన్యానికి పాల్పడుతుండగా ఈదా సాంబిరెడ్డి అడ్డుకున్నారన్న కక్షతోనే భాష్యం ప్రవీణ్ దాడి చేయించారని క్షతగాత్రుడు కల్లి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు.

రాడ్లు, కర్రలతో దాడి



''గుంటూరు ఆర్టీఓ కార్యాలయం దగ్గర్లోని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయం నుంచి కారులో బయలుదేరాం. ఉంగుటూరు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి మా కారును మరో కారుతో అడ్డగించారు. పదిమంది వరకు దిగి మా వాహనం తలుపులు తీయాలని కేకలు వేశారు. అంతలోనే కర్రలు, ఇనుపరాడ్లతో కారు అద్దాలను ధ్వంసం చేశారు. కారులో ముందు కూర్చున్న సాంబిరెడ్డిని కిందకు దించి, ఆమడ దూరం తీసుకెళ్లి విచక్షణారహితంగా దాడి చేశారు. కేకలు వేస్తున్నా.. వదల్లేదు. నా వీపుపైనా చితకబాదారు.

– కె.గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు

సర్జికల్ మాస్కులు ధరించారు



నిందితులు కొందరు సర్జికల్ మాస్కులు ధరించారు. వారి వయసు 35 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటాయి. సుమారు పది మంది వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో దాడిచేశారు. కారు అద్దాలు పగలగొట్టారు.

– కె.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు



సంఘటనా స్థలంలో రక్తపు మరకలు, చెప్పులు

రక్షిత తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు

జెడ్పీ సీఈఓ వసంత రాయుడు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వసంత రాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ ఎన్ఎస్‌వీబీ వసంత రాయుడు పేర్కొన్నారు. నగరంపాలెంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సీఈఓ వసంత రాయుడు ప్రధాన మంత్రి గ్రామీణ ఆదర్శ యోజన (పీఎంఏజీవై) మొదటి విడతలో ఎంపికైన గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వారీగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులు జెడ్పీకి అందుబాటులో ఉన్న దృష్ట్యా, సంబంధిత నిధులతో సీపీడబ్ల్యూఎస్ పథకాలకు కేటాయించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ తాడేపల్లి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించిన అంశాలపై సీఈఓ వసంత రాయుడు అధికారులతో సమీక్షించారు. పారిశుద్ధ్య పనుల వివరాలను రోజూ పీఆర్-1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలో 50 లక్షల మొక్కలను నాటాలని కలెక్టర్ లక్ష్యాన్ని నిర్దేశించారని, దీనికోసం కృషి చేయాలని కోరారు.

క్లుప్తంగా

యార్డులో 56,693 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 54,687 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 56,693 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,534 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మంగళవారం మరణించాడు. రైల్వే జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. గుంటూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి 7వ నంబర్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వృద్ధుడు(50) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. రోజు వారీ తనిఖీల్లో భాగంగా అతడిని గుర్తించిన జీఆర్పీ పోలీసులు వెంటనే 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మరణించాడు. అతడికి సంబంధించిన వివరాలేమీ తెలియలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపారు. వృద్ధుడి సమాచారం తెలిసిన వారు గుంటూరు రైల్వే పోలీసులు 9440627546,9550523485 నంబర్లను సంప్రదించాలని జీఆర్పీ సీఐ కోరారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్ల తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6300, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

వ్యవసాయ రంగానికి రుణాలివ్వాలి

- బ్యాంకర్లకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం
- ఆర్థిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.34,730 కోట్లు



రుణ ప్రణాళిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, బ్యాంకు అధికారులు

గుంటూరు వెస్ట్: జిల్లా వ్యవసాయ రంగంతోపాటు మహిళలు, యువత ఆర్థికాభివృద్ధికి విరివిగా రుణాలిచ్చి ప్రోత్సహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రుణ ప్రణాళికా లక్ష్యం రూ.34,730 కోట్లుగా నిర్ణయించామని పేర్కొన్నారు. ఇందులో ప్రాధాన్య రంగాలైన వ్యవసాయానికి సంబంధించి స్వల్ప రుణాలు, టర్మ్ రుణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు, డ్వాక్రా, పరిశ్రమలకు సంబంధించిన ఎంఎస్ఎంఈ, ఎగుమతులకు రూ.24,501.93 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇతర రుణాలకు సంబంధించి రూ. 10,228.62 కోట్లు, కౌలు రైతులకు రూ.180 కోట్లు లక్ష్యాలుగా నిర్ణయించామన్నారు. అమరావతి రాజధాని అయిన నేపథ్యంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా అవసరమైన వారికి రుణాలు ఇవ్వాలన్నారు. రుణాలిస్తే పరిశ్రమల స్థాపన జరుగుతుందని చెప్పారు.

గ్రామీణ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో బ్యాంకింగ్ రంగ సేవలు మరింత విస్తరించాలన్నారు. వారికి బ్యాంకు రుణాలతోపాటు ఇతర బెనిఫిట్స్ గురించి వివరించాలన్నారు. చిరు వ్యాపారులకు, వీధి వ్యాపారులకు డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఆహార శుద్ధి పరిశ్రమలకు పీఎంఎఫ్ఎంఈ ద్వారా రుణాల మంజూరు వేగవంతం చేయాలన్నారు. టిడ్కో, హౌసింగ్ రుణాల మంజూరుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ వివరించారు. అనంతరం కలెక్టర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహీపాల్ రెడ్డి, డీసీసీ కన్వీనర్ ఎస్.జవహర్, ఆర్బీ ఎల్డీఓ నవీన్ చరినెల్లి, నాబార్డ్ డీడీఎం జి.శరత్ బాబు, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్.ఎం. పరిమళ, ఇతర బ్యాంకు మేనేజర్లు రుణ ప్రణాళిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

బడుల్లో వందశాతం హాజరు ఉండేలా చూడాలి

ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం వంద శాతం ఉండేట్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ సర్వేలో వివరాలు నమోదు కాని వాటిపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డబుల్ ఆధార్ ఉన్న వారి వివరాలు పరిశీలించి విద్యాశాఖ సైట్‌లో అప్‌డేట్ చేసేలా రాష్ట్ర స్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక పాఠశాల మారిన వెంటనే అక్కడ మ్యాపింగ్ అయ్యేలా చూడాలన్నారు. బడిమానేసిన పిల్లల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడి పిల్లలు పాఠశాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలంతా యూనిఫాం దరించాలని, ఆగస్టు 1 నుంచి యూనిఫామ్ ధరించని పిల్లలను స్కూల్‌కు అనుమతించవద్దని చెప్పారు. మధ్యాహ్నం భోజనం అందించే ఏజెన్సీలు నాణ్యమైన సరుకులు అందించాలని, గుడ్ల నాణ్యత పరిశీలించాలని, మెను ప్రకారం ఆహారం అందించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఈఓ శైలజ, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బ్రహ్మానందకుమార్



సర్టిఫికెట్లను అందజేస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బ్రహ్మానందకుమార్

ప్రత్తిపాడు: మహిళలు కుట్టు శిక్షణతో స్వయం ఉపాధిని పొందవచ్చని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జి. బ్రహ్మానందకుమార్ చెప్పారు. గుంటూరు కొత్తపేట యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా మండల పరిధిలోని తుమ్మలపాలెంలో 30 రోజులపాటు మహిళలకు టైలరింగ్‌పై శిక్షణనిచ్చారు. శిక్షణ ముగియడంతో మంగళవారం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మానందకుమార్ గ్రామస్తులతో కలిసి మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. డైరెక్టర్ జి.బ్రహ్మానంద కుమార్ మాట్లాడుతూ 30 రోజులపాటు నిష్ణాతులైన శిక్షకులతో కుట్టుశిక్షణపై మహిళలకు తర్ఫీదునిచ్చామన్నారు. శిక్షణ తరగతులకు హాజరైన ప్రతి మహిళలకు ఉచితంగా కుట్టు సామగ్రిని కూడా అందించినట్లు వివరించారు. మహిళలకు బ్యాంకు ద్వారా రుణ సదుపాయాన్నీ అందిస్తామని చెప్పారు. మహిళలందరినీ సమీకరించి వారి అభివృద్ధికి సహకరించిన వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థను ఆయన అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాంబాబు, వాటర్ ఎయిడ్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సురేష్ గ్రామస్తులు, వాటర్ ఎయిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు చెల్లించాల్సిన బాధ్యత కమీషన్ వ్యాపారులదే

మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కాకుమాను శ్రీనివాసరావు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో రైతులు విక్రయించిన మిర్చి బస్తాలకు డబ్బు చెల్లించాల్సిన బాధ్యత మిర్చి కమీషన్ వ్యాపారులదేనని మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు, యార్డు పర్సన్ ఇన్‌చార్జి కాకుమాను శ్రీనివాసరావు చెప్పారు. మిర్చి యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు, యార్డు అధికారులు, సిబ్బందితో మంగళవారం సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు పైకం ఇచ్చే సమయంలో కమీషన్ వ్యాపారులు తక్ పట్టీపై రైతు సంతకం విధిగా తీసుకోవాలని సూచించారు. రైతులకు చెల్లించాల్సిన అమ్మకపు సొమ్మును అదే రోజు కమీషన్ వ్యాపారులు చెల్లించాలని, ఎవరైనా కమీషన్ వ్యాపారులు అదే రోజు పైకం చెల్లించకపోతే వారి లైసెన్స్ సస్పెండ్ లేదా శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు తమ సొమ్ములు అందకుంటే యార్డు కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, అధికారులు సుబ్రమణ్యం, శ్రీకాంత్, మిర్చి కమీషన్ వ్యాపారుల అసోసియేషన్ నాయకులు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, కొత్తూరి సుధాకర్, ఎగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు జుగిరాజ్ భండారీ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవులకు నిరాశే

మేకల సుబ్బారావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర బడ్జెట్ వేతన జీవులను తీవ్ర నిరాశకు గురి చేసిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు అభిప్రాయపడ్డారు. ఆదాయపు పన్ను స్లాబులు ఆశాజనకంగా లేవని పేర్కొన్నారు. పెరిగిన ధరలు, ప్రస్తుత ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని, పాత పన్ను విధానంలో మార్పులు చేసి ఉంటే మధ్యతరగతి వర్గాలకు, సామాన్య వేతన జీవులకు మేలు చేకూరేదని చెప్పారు. నూతన పన్ను విధానంలో రూ.ఏడు లక్షల ఆదాయం వరకు ఉండే వారికి ఇచ్చే రిబేటును, పాత పన్ను విధానంలో ఉండే వారికి కూడా వర్తింపజేసి ఉండాల్సిందన్నారు. సేవింగ్స్ పరిమితిని కనీసం రూ.2.5 లక్షలకు పెంచి ఉంటే, పొదుపు చేసుకునేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రూ.ఎనిమిది లక్షల వరకు పన్ను మినహాయింపు ఇస్తారని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశే మిగిలిందని పెదవి విరిచారు. ప్రామాణిక తగ్గింపును రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచడం కొంతమేర ఉపయోగకరమైనా, ప్రస్తుతం జీవన వ్యయం బాగా పెరిగినందున రూ.లక్ష మేరకు పెంచితే ప్రయోజనంకరంగా ఉండేదని చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్ల కేటాయింపు, పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యం, పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందించటం, విశాఖ – చెన్నై కారిడార్ ఏర్పాటు వంటివి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి మేలు చేసేవే అయినా, విభజనతో ఏర్పడిన లోటు బడ్జెట్‌ను పూడ్చేందుకు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చేందుకు విభజన చట్టం ప్రకారం ప్రత్యేక హోదా ప్రకటించి ఉండాల్సిందని పేర్కొన్నారు. ఆర్థిక భద్రత కలిగించడానికి సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు నాస్తి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కేంద్రం తీరు మాటలు జాస్తి, కేటాయింపులు నాస్తి అన్న చందంగా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందించారు. పోలవరం ప్రాజెక్టు, విశాఖ–చెన్నై కారిడార్ విషయంలో సానుకూలమైన మాటలు చెప్పారే తప్ప బడ్జెట్ కేటాయింపుల్లో నిధులు చూపలేదని పేర్కొన్నారు. బిహార్‌కి బడ్జెట్ కేటాయింపులు చేసి, ఏపీకి మాటలతో సరిపెట్టడం ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయ రంగ సంస్కరణల పేరుతో సన్న, చిన్నకారు రైతులను వ్యవసాయ భూముల నుంచి తప్పించే ధోరణి ప్రమాదకరమన్నారు. మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. 500 పరిశ్రమల్లో 4 కోట్ల ఉద్యోగాలు అన్నమాట నిరుద్యోగ యువతను మోసగించటమేనని పేర్కొన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అనివార్యమైన స్థితి బీజేపీ ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు.

మెప్మాలో అక్రమాలపై రెండోరోజు విచారణ



పొదుపు సంఘాల సభ్యురాలిని విచారణ చేస్తున్న రాజశేఖర్, కీర్తి

పొన్నూరు: పట్టణంలోని మెప్మా విభాగంలో జరిగిన అక్రమాలపై విచారణ రెండో రోజు కొనసాగింది. మెప్మా పీడీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు విచారణ అధికారులు రాజశేఖర్, కీర్తి మంగళవారం నిడుబ్రోలు పరిధిలోని ఐదు పొదుపు సంఘాలకు సంబంధించి సభ్యులను విచారణ చేశారు. స్థానిక మెప్మా సిబ్బంది అధిక రుణాలు తీసుకొని తమకు కొద్దిగా ఇచ్చి మిగిలినది స్వాహా చేశారని, బ్యాంకులకు తిరిగి చెల్లించలేదని డ్వాక్రా సభ్యులు అధికారులకు తెలిపారు. తాము తీసుకున్న దానికి వాయిదాలు సకాలంలో చెల్లించామని వివరించారు. దీంతో బ్యాంకులు నోటీసులు ఇచ్చాయని వెల్లడించారు. దీంతో స్పందించిన విచారణ అలధికారులు మహిళలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బాధితులకు న్యాయం జరిగేలా పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. బుధవారం కూడా విచారణ కొనసాగుతుందని సమాచారం.

కేంద్ర బడ్జెట్‌తో వికసిత్ ఆంధ్ర

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్రకుమార్



గుంటూరు మెడికల్: అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజల కల రాజధాని సాకారం అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ అన్నారు. వికసిత్ ఆంధ్ర దిశగా కేంద్ర బడ్జెట్ కేటాయింపులను స్వాగతిస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ఏర్పడిన ఏ రాష్ట్రానికి ఇవ్వని రీతిలో నిధులు ఏపీకి కేటాయించడం డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారానే సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో అమరావతికి ఇంకా నిధులు కేటాయిస్తాం అని చెప్పడం ద్వారా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సానుకూల దృక్పథం చూపారని చెప్పారు. వెనుక బడిన జిల్లాలకు నిధులు, పోలవరాని కావాల్సిన సంపూర్ణ సహకారానికి హామీ ఇవ్వడం హర్షణీయమన్యానరు.


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక

ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలో చాంపియన్ షిప్ పోటీలు



క్రోసూరు: ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలోని గుడ్‌షెపర్డ్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు మొత్తం 36 మందిని ఎంపికచేశామని ఉమ్మడి గుంటూరు జిల్లా క్రీడా అసోసియేషన్ సెక్రటరీ జి.శివపార్వతి తెలిపారు. మంగళవారం స్థానిక సెయింటాన్స్ పాఠశాలలో జరిగిన క్రీడాకారుల ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి మొత్తం 170 మంది హాజరుకాగా వారిలో బాలురు 18, బాలికలు 18 మంది మొత్తం 36 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. పాఠశాల హెచ్ఎం సిస్టర్ మేరీ రజిత, పీఈటీ మక్కెన వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు



నరసరావుపేట రూరల్: ఉద్యాన పంటలను సాగుచేస్తున్న రైతుల ఆర్థికాభివృద్ధికి పలు పథకాలను అమలు చేస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్‌వీ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ ద్వారా ఈ ఏడాది రూ.5.41కోట్లను సబ్సిడీ ద్వారా రైతులకు అందజేయనున్నట్లు తెలిపారు. పండ్లతోటల విస్తరణ పథకంలో భాగంగా మామిడి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, జామూన్ తోటలు, హైబ్రిడ్ కూరగాయలు, పూల తోటలు సాగుకు సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. ఉద్యాన యాంత్రీకరణ కింద చిన్న ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్, తైవాన్ స్ప్రేయర్‌లను సబ్సిడీ కింద మంజూరు చేస్తామని తెలిపారు. వివిధ పథకాలకు రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన ద్వారా రూ.61.30లక్షలను సబ్సిడీ ద్వారా రైతులకు అందజేస్తామని తెలిపారు. సాగుకు అనుకూలమైన మండలాల్లో రూ.68.64లక్షలను ప్రభుత్వం ఆర్థిక కేటాయింపు చేసినట్టు వివరించారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం



నరసరావుపేట: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ పల్నాడు జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పాలేటి శ్రీనివాసరావు, నడింపల్లి సుబ్బారావు ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలోని అరండల్‌పేటలో గల సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.రామచంద్రరావు, జిల్లా కోశాధికారిగా వై.వెంకటేశ్వరరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా డి.ఆరోన్‌రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ఎ.అనంతమ్మతో పాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి తల్లపునేని రామారావు, ఉపాధ్యక్షులు మొక్కపాటి రాంబాబు వ్యవహరించారు.